

పడిగాపులు!

బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న యూరియా

ఒక్కో బస్తా రూ.420 నుంచి రూ.450 వరకు విక్రయం

- అంతపెట్టి కొనలేమని పీఏసీఎస్‌లకు రైతుల పరుగు
- అక్కడ అరకొరగా సరఫరా.. ఇండెంట్ పెట్టినా రాలేదని సమాధానం
- పెనుమల్లి, బుద్దాలపాలెం పీఏసీఎస్‌ల వద్ద రైతుల ఆందోళన
- ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినతి

అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లాకు సరఫరా అవుతున్న యూరియాను కొందరు అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక్కో బస్తా రూ.420 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. రూ.266.50లకు విక్రయించాల్సి బస్తాను ఇంత ధర పెట్టి కొనలేమని రైతులు పీఏసీఎస్‌లకు పరుగులు తీస్తున్నారు. అక్కడ అరకొరగా పంపిణీ చేయడంతో ఇది సరిపోదని సిబ్బందితో వాదనకు దిగుతున్నారు. ఇండెంట్ పెట్టాం వస్తుందని చెప్పడంతో పీఏసీఎస్‌ల వద్దే పడిగాపులు పడుతున్నారు.

6



మోపిదేవి సొసైటీ గోడౌన్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే నాట్లు పూర్తి చేసిన పొలాల్లో మొదటి, రెండో కోటాగా రైతులు కాంప్లెక్స్ ఎరువులు వేయాల్సి ఉంది. కాంప్లెక్స్ ఎరువులతో యూరియాను తప్పనిసరిగా కలిపి జల్లితేనే వరిపైరు ఏపుగా ఎదుగుతుంది. మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, రిటైల్ వ్యాపారులకు 10,500 టన్నుల యూరియాను సరఫరా చేశారు. అయినా అందుబాటులో లేదని, గుడివాడలోని గోడౌన్‌కు మిగతా 6లో..

నిరాశగా వెనుదిరుగుతున్న రైతులు

మచిలీపట్నం మండలంలోని సెలకుర్రు పీఏసీఎస్ పరిధిలో 13 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో సుమారుగా 10వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ పీఏసీఎస్‌కు రైతులు యూరియా కావాలని వెళితే ఇండెంట్ పెట్టి చాలా రోజులైందని, ఇంతవరకు రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. యూరియా కోసం పీఏసీఎస్ వద్దకు వచ్చిన రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నామని, ఇక్కడి డిమాండ్‌కు అనుగుణంగా యూరియాను తమ సొసైటీకి ఇవ్వాలని పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

రెండు కట్టలే ఇస్తామనడంపై ఆగ్రహం

జిల్లాకు వచ్చిన యూరియాను గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ చేయడంతో రైతులు అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో ఒక్కో కట్టను రూ.400, ఆపైన ధరకు కొనుగోలు చేయలేక పీఏసీఎస్‌లకు పరుగులు తీస్తున్నారు. అక్కడ ఒక్కో రైతుకు రెండు కట్టలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు ఎకరాలకుపైన వ్యవసాయం చేసే రైతులకు రెండు కట్టల యూరియా ఇస్తే ఎలా సరిపెట్టుకోవాలని పీఏసీఎస్‌ల సిబ్బందితో వాదనకు దిగుతున్నారు.



జ్యోతి వెలిగించి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బొండా ఉమా, మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు



పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

పింగళి స్ఫూర్తి.. కృష్ణా ఖ్యాతి

'హర్ ఘర్ తిరంగా'లో కొనియాడిన సీఎం చంద్రబాబు

పింగళి వెంకయ్య చిరస్మరణీయులంటూ ప్రశంసలు

విజయవాడ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యను, ఉమ్మడి కృష్ణాజిల్లా ఖ్యాతిని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం జరగ్గా, ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం.. జాతీయ జెండా ఔన్నత్యాన్ని తెలియజేశారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని రగిల్చేలా జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య కృష్ణాజిల్లాలోని భట్లపెనుమర్రులో జన్మించారని, దేశం కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీతో సన్నిహిత సంబంధాలను కొనసాగించి, జాతీయ జెండాను రూపొందించి దేశ ప్రజల మనసులో మిగతా 6లో..

ఏపీటీడీసీ ఉద్యోగుల నిరసన

- పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణపై మండిపాటు
- ఆటోనగర్‌లోని కార్యాలయం ముట్టడి
- పర్యాటక కార్యదర్శి అజయ్‌జైన్ వ్యవహారంపై ఫైర్
- ప్రైవేట్‌కు ఇస్తే సమ్మె తప్పదని హెచ్చరిక



ఆటోనగర్‌లోని ఏపీటీడీసీ కార్యాలయం ముట్టడిలో ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆస్తులను ప్రైవేట్‌పరం చేయొద్దంటూ ఏపీటీడీసీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఆటోనగర్‌లోని స్టాలిన్ కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీటీడీసీ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ ఒంటెత్తు పోకడలతో లాభాలు వచ్చే యూనిట్లను ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక మీదట భయపడేది లేదని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడతామని, సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రైవేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన సూచనలను కూడా సెక్రటరీ అజయ్‌జైన్ పట్టించుకోవటం లేదని ఉద్యోగులు పేర్కొన్నారు. కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చెప్పారని, అలాగే సీకేలో ఉన్న యూనిట్లను అవకాశాన్ని బట్టి మాత్రమే ప్రైవేట్‌కు ఇవ్వాలని సూచించారే తప్ప గంపగుత్తగా ప్రైవేట్ చేతుల్లో పెట్టమని ఎక్కడా చెప్పలేదన్నారు. అజయ్‌జైన్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం గంపగుత్తగా పర్యాటక యూనిట్లను బడాసంస్థలకు కట్టబెట్టే యోచన చేస్తున్నారన్నారు. లాభాలు వచ్చే యూనిట్లను కొంతకాలంగా పథకం ప్రకారం నష్టాలపాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా మిగతా 6లో..



మగ్గంపై నేసిన వంద అడుగుల చీర ప్రదర్శిస్తున్న మంత్రి రవీంద్ర, నేతన్నలు

చేనేతకు చేయూత

'నేతన్న భరోసా' కింద ఏటా రూ.25వేలు

- చేనేత కుటుంబానికి 200 యూనిట్ల కరెంట్ ఉచితం
- పవర్‌లూమ్ మగ్గాలు ఉన్నవారికి నెలకు 500 యూనిట్లు
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు చేయూత అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో సోమవారం చేనేతల అభినందన సభ నిర్వహించారు. వంద అడుగుల చేనేత చీరను ప్రదర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ 'నేతన్న భరోసా' కింద ఏటా రూ.25వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంట్లో మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని చెప్పారు. తద్వారా వారికి ఏడాదికి రూ.15వేల భారం తగ్గుతుందన్నారు. పవర్‌లూమ్ మగ్గాలు ఉన్నవారికి నెలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఎన్నికల హామీల అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వివరించారు. గత వైసీపీ పాలనలో చేనేత కార్మికులు ఆస్తులన్నీ తాకట్టు పెట్టుకుని జీవించారన్నారు. కొందరు చేనేత కార్మికులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని గుర్తు చేశారు. చేనేతను ఆదుకునేందుకు ప్రతి శనివారం అందరూ చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. కృష్ణాజిల్లాలో అత్యంత ప్రజాదరణ పొందిన కలంకారీ వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచుతామని చెప్పారు. కార్మికులు నేసిన వస్త్రాలను సొసైటీలకు ఇస్తున్నారని, సొసైటీల్లో అప్పులు పేరుకుపోయి కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సొసైటీలలోని మిగతా 6లో..



శ్రీవిద్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం

- బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటాం 8
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

తండ్రిని కొట్టి చంపేశాడు!

- తనతో పెయింటింగ్ పనికి రానన్నాడని గొడవ
- తండ్రిని ఈడ్చుకెళ్లి గేటుకేసి కొట్టిన కొడుకు
- తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై ఘటన
- హత్య కేసు నమోదు చేసిన పెనమలూరు పోలీసులు



కొడుకు చేతిలో ప్రాణాలు కోల్పోయిన శౌరి (ఫైల్)



తండ్రిని చంపిన కేశవరావు

పెనమలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తనతో పాటు పెయింటింగ్ పనికి రావడంలేదనే కోపంతో తండ్రిని కొడుకు కొట్టి చంపిన ఘటన తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై ఆదివారం జరిగింది. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. తాడిగడప శ్రీనివాసనగర్ కట్టకు చెందిన నస్సం శౌరి(68) పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు కేశవరావు కూడా పెయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. మద్యానికి అలవాటు పడటంతో భార్య అతనితో గొడవ పెట్టుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కేశవరావు తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి రోజూ భోజనం చేసి వెళ్తున్నాడు. తండ్రి శౌరి అప్పుడప్పుడు కుమారుడు కేశవరావు వెంట పనులకు వెళ్తుండేవాడు. కూలి డబ్బులు సరిగా ఇవ్వకపోవడంతో పనికి వెళ్లడం మానేశాడు. ఆదివారం సాయంత్రం తన వెంట పెయింటింగ్ పనులకు ఎందుకు రావంటూ కేశవరావు తండ్రి శౌరితో గొడవ పెట్టుకున్నాడు. తండ్రిని రోడ్డు మీద పడేసి తలపట్టుకొని ఈడ్చుకుంటూ ఇంట్లోకి తీసుకెళుతూ గేటుకేసి గుద్దాడు. ఆ తర్వాత ఇంట్లోకి తీసుకెళ్లి నాపరాయికి వేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శౌరిని చూసిన కుమార్తె, చుట్టుపక్కల వారు వెంటనే అక్కడకెళ్లి కేశవరావు నుంచి శౌరిని విడిపించి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం శౌరి మృతి చెందాడు. శౌరి కుమార్తె శశిరేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

మది నిండా.. జెండా పండుగ

ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి : కలెక్టర్ లక్ష్మీశ



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకాలతో ర్యాలీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, విద్యార్థులు

వన్‌టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరి మదిలో దేశభక్తిని చాటిచెప్పేలా ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆకాంక్షించారు. ప్రతిఒక్క హృదయం స్పందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆగస్టు 15 వేడుకలకు సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. సోమవారం హనుమాన్‌పేటలోని ప్రభుత్వ పాత ఆసుపత్రి నుంచి జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ, పోలీసు, యువజన సంక్షేమం, వైద్య, ఆరోగ్యశాఖ, వాకర్స్ క్లబ్ వంటి వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పలువురు బైక్‌లు, సైకిళ్లపై ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు స్కేటింగ్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్రివర్ణ పతాకాలను చేతపట్టుకుని భారత్ మాతాకి జై, వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు. ఐకమత్యానికి, స్వేచ్ఛా భారతానికి త్రివర్ణపతాకం ప్రతీక అని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వీరసైనికుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఆపరేషన్ సిందూర్ దేశ సత్తాను చాటిచెప్పిందన్నారు.



త్రివర్ణ పతాక వేడుకల స్ఫూర్తిగా ఐక్యతా సందేశంతో ముందుకు సాగాలన్నారు. దేశ సమగ్రాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి గొప్ప కార్యక్రమాల్లో అందర్ని భాగస్వాములను చేస్తున్నందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగఫలితమే నేడు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ప్రతిఒక్కరూ సమిష్టిగా ముందడుగు వేయాలని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ప్రగతిపథంలో ముందడుగు వేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబయిన నగరం



కష్టంగా వున్నా పథకాలు అమలు చేస్తున్నాం

» ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉంగుటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నుంచి సుమారు రూ.10లక్షల కోట్ల అప్పులతో పాటు రూ.1.25లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు వారసత్వంగా వచ్చిందని, రాష్ట్ర ఆర్థికపరిస్థితి కష్టంగా వున్నా.. పథకాలు అమలు చేస్తూ ప్రతిపైసా పేదల అభివృద్ధి, సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఉంగుటూరు మండలం, పొట్టిపాడులో వన్‌వే మిషన్, స్టార్‌హాస్పిటల్స్(హైదరాబాద్), సంయుక్త సౌజన్యంతో, గ్రామ పెద్దలు, దాతల సహకారంతో కోటి పదిలక్షల వ్యయంతో నిర్మించిన పొట్టిపాడు ఫంక్షన్‌హాలు(సామాజిక కళ్యాణమండపం)ను ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వన్‌వే మిషన్ మాజీ అధ్యక్షుడు కొడాలి ఏలియా అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన ప్రతి ఒక్కరూ సొంత గ్రామంలో మౌలిక వసతుల కల్పనకోసం చేయూత నందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదల అభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన పీ-4పథకంలో భాగస్వాములు కావాలని పయ్యావుల సూచించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం తపన పడుతున్న పంచాయతీరాజ్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ గూడపాటి సీతారామస్వామిని, ఫంక్షన్‌హాలు నిర్మాణానికి సహకరించిన ఆయన కుమారుడు డాక్టర్ గూడపాటిరమేష్, వన్‌వే మిషన్ ప్రతినిధి కొడాలి జోయల్ సుగుణాకర్‌లను మంత్రి అభినందించారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే యార్లగడ్డ చేస్తున్న కృషిని ఈసందర్భంగా మంత్రి కొనియాడారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. తొలుత గ్రామంలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి మంత్రి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాగా కళ్యాణమండపం నిర్మాణానికి వన్‌వే మిషన్ సంస్థ ప్రతినిధి కొడాలి జోయల్ సుగుణాకర్ 460 గజాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వగా, స్టార్‌హాస్పిటల్స్ ప్రముఖ గుండెవైద్యనిపుణులు డాక్టర్ గూడపాటి రమేష్ రూ.75లక్షలు, గ్రామస్థుల నుంచి 25లక్షల విరాళాలు సేకరించి రూ. కోటి వ్యయంతో పేద, మధ్యతరగతి ప్రజలకు అనువుగా కళ్యాణమండపం నిర్మించినట్టు నిర్వాహకులు జోయల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, పంచాయతీరాజ్‌శాఖ సీఈ గూడపాటి సీతారామస్వామి, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


పొట్టిపాడులో ఫంక్షన్‌హాలును ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్


ప్రసాదాల తయారీ విభాగాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

దసరా ఉత్సవాలలో ప్రసాదాల కొరత రానీయొద్దు

» దుర్గగుడి ఈవో శీనానాయక్



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో రానున్న దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ప్రసాదాల కొరత లేకుండా ఇప్పటి నుంచే అన్నిఏర్పాట్లు చేసుకోవాలని ఈవో వీకే శీనానాయక్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన ప్రసాదాల తయారీ, అన్నదాన విభాగాలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, వంటపాత్రలు, పొయ్యిలు ముందే పరిశీలన చేసుకుని అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ, అన్నప్రసాద తయారీలో పలు సూచనలు చేశారు. ఉత్సవాల ప్రారంభానికి ముందే అన్నీ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. దసరా ఉత్సవాల్లో భక్తులకు సంతృప్తికరమైన సేవలు అందించటమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు చెప్పారు.


నిర్మాణంలో ఉన్న లడ్డూ పోటు, అన్నదాన భవనాలను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు

నెలాఖరుకు కొత్తపోటు సిద్ధం

దుర్గగుడిలో కొత్తగా నిర్మాణమవుతున్న లడ్డూ పోటు భవనం, అన్నప్రసాద భవనాలను ఈ నెలాఖరు నాటికి పాక్షికంగా అమలులోకి తీసుకువస్తామని ఈవో తెలిపారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులకు ఆయన పలుసూచనలు చేశారు. సోమవారం నిర్మాణంలో ఉన్న లడ్డూపోటు, అన్నదాన భవనాలను తనిఖీ చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ రెండు నిర్మాణాలను ఉత్సవాలకు ముందే సిద్ధం చేసుకోవాలని, సిబ్బందిని పెంచి త్వరగా పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ రెండు భవనాలను దాదాపుగా 100 శాతం వినియోగించేలా కార్యాచరణ చేయాలన్నారు. దేవదాయ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, దేవస్థానం ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



అన్నవితరణకు విరాళం

విజయవాడ గాంధీనగర్‌కు చెందిన వక్కలగడ్డ విఠలరావు సోమవారం దుర్గగుడి అధికారులను కలిసి అన్నవితరణకు రూ.1,11,116లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఉద్యోగులు అమ్మవారి దర్శనం కల్పించి దుర్గమ్మ చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.


తేజేష్‌ను సత్కరిస్తున్న చలసాని అంజనేయులు తదితరులు

రోలర్ స్కేటింగ్ స్వర్ణ విజేతకు సత్కారం

చిట్టినగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల దక్షిణకొరియాలో నిర్వహించిన 20 ఏసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పడిగ తేజేష్ వివిధ విభాగాల్లో స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించిడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని అంజనేయులు అన్నారు. పడిగ తేజేష్‌ను సోమవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీ సమావేశం హాల్లో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులతో కలిసి చైర్మన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ, భవిష్యత్తులో తేజేష్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తేవాలన్నారు. తేజేష్ తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తనకు స్పాన్సర్ చేసి ప్రోత్సాహించిన కృష్ణామిల్క్ యూనియన్, చైర్మన్ చలసానికి పడిగ తేజేష్ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న మహిళా పీఎస్ సీఐ వాసవి

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత

గుణదల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లి నుంచి తప్పిపోయిన బాలుడ్ని శక్తిటీమ్ మహిళా పోలీసుల పర్యవేక్షణతో గంటల వ్యవధిలోనే తిరిగి తల్లి చెంతకు చేర్చిన ఘటన పండిట్‌నెహ్రూ బస్టాండ్ వద్ద సోమవారం జరిగింది. చిట్టినగర్‌లో నివాసం ఉంటున్న మహిళకు ముగ్గురు పిల్లలు. భర్త చనిపోవడంతో ఒంటరిగానే జీవిస్తున్నది. ఇద్దరు పిల్లలకు అనారోగ్య కారణంగా వారిని వెంటబెట్టుకుని పాత ప్రభుత్వాసుపత్రికి సోమవారం వచ్చింది. ఈ క్రమంలో ఓ బాలుడు తల్లి నుంచి తప్పిపోయి బస్టాండ్‌కు చేరుకున్నాడు. అదేసమయంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ వాసవి శక్తియాప్, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం బస్టాండ్‌లో చేపట్టారు. బాలుడు ఒంటరిగా ఏడుస్తూ తిరుగుతుండగా వివరాలు తెలుసుకుని బాలుణ్ని వెంటపెట్టుకుని ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే ఆందోళనలో ఉన్న తల్లికి బాలుణ్ణి అప్పగించారు.

పింగళి స్ఫూర్తి.. కృష్ణా ఖ్యాతి

(5వ పేజీ తరువాయి)

చిరస్మరణీయులుగా నిలిచారని పేర్కొన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఘనంగా నిర్వహిద్దామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 2047 నాటికి ప్రపంచంలోనే మనదేశం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య మన ప్రాంతానికి చెందినవారు కావడం మనకు గర్వకారణమన్నారు. అనంతరం సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, క్రియేటివిటీ, కల్చర్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, సాంస్కృతిక శాఖ ఈడీ ఎంవీఎస్ మల్లికార్జునరావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు, సైనిక కుటుంబాలకు, క్రీడాకారులకు సత్కారం

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను, సైనిక కుటుంబాలను, రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారులను సీఎం చంద్రబాబు సత్కరించారు. విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం తదితర కార్యక్రమాల్లో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుడు గద్దె సత్యనారాయణ భార్య సుశీలను, వీరమహిళ రాంపిళ్ల నరసాయమ్మ కుమారుడు జయప్రకాష్‌ను, యుద్ధంలో మరణించిన సైనికుడు నాగరాజు సతీమణి మంగాదేవికి జ్ఞాపికలు అందజేశారు. అంతర్జాతీయ క్రీడాకారులు టి.సూర్యచరిష్మ, చెరుకూరి డాలీ శివాని, షణ్ముక నాగసాయి, ఎం.భావన, ఎ.దుర్గాసాయిశశాంక్, బి.శిరీష, చిల్లకల్లు స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లును సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



స్టాల్స్‌ను సందర్శిస్తు వివరాలు అడిగి తెలుసుకుంటున్న చంద్రబాబు, కళాకారులను సత్కరిస్తున్న సీఎం

పడిగాపులు!

(5వ పేజీ తరువాయి)

వ్యాగన్ వస్తేనే ఇస్తామని చెప్పి ఎవరికివారు తప్పించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు, డీలర్‌లు, హోల్‌సేల్ డీలర్‌లు, కొందరు రాజకీయ నాయకులు కూడబలుక్కుని యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. 45కిలోల యూరియా బస్తాను రూ.266.50లకు విక్రయించాల్సి ఉండగా, రూ.420 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు. జిల్లాకు వచ్చిన యూరియాను ప్రాధాన్యతాక్రమంలో పీఏసీఎస్‌లకు ఇవ్వాలి, కానీ పీఏసీఎస్‌లకు ఇచ్చినట్లుగా రికార్డుల్లో లెక్కలు చూపి యూరియాను అక్కడకు పంపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా పీఏసీఎస్ చైర్‌పర్సన్ అధికారులపై ఒత్తిడితెస్తే ఆ సొసైటీకి యూరియా కొంతమేర ఇచ్చి సరిపెడుతున్నారు. మిగిలిన సొసైటీల సిబ్బంది, చైర్‌పర్సన్‌లు యూరియా కోసం ఇండెంట్ పెట్టామని, ఇవ్వాలని అడిగితే త్వరలో గుడివాడలోని గోడౌన్‌కు వ్యాగన్ వస్తుందని, అప్పుడు యూరియాను పంపుతామని చెప్పి సరిపెడుతున్నారు.

పోలీసుల రంగ ప్రవేశం

పెడన మండలం పెనుమల్లి పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందనే సమాచారంతో రైతులు పెద్దఎత్తున అక్కడకు సోమవారం చేరుకున్నారు. రెండు కట్టలకు మించి ఇవ్వబోమని పీఏసీఎస్ సిబ్బంది చెప్పడంతో రైతులు తిరగబడ్డారు. ఎక్కువ పొలం సాగుచేసే రైతులకు అవసరమైనంత యూరియాను ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది. రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగుతున్నారనే సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. రైతుల వద్ద ఉన్న పత్రాల ఆధారంగా చేసుకుని వారిని క్యూలో నిలబెట్టి మరీ యూరియాను విక్రయించేలా ఏర్పాట్లు చేశారు.

బుద్దాలపాలెంలో రైతుల మధ్య వాగ్వాదం

మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం పీఏసీఎస్ వద్ద రైతులు యూరియా కోసం సోమవారం బారులు తీరారు. బుద్దాలపాలెం సొసైటీ పరిధిలోని బుద్దాలపాలెం, బొర్రపోతుపాలెంలోని రైతులకు ముందస్తుగా యూరియాను విక్రయించి, ఆ తర్వాత యూరియా మిగిలితే పక్కగ్రామాల రైతులకు విక్రయించాలని స్థానిక రైతులు షరతు పెట్టారు. దీంతో యూరియా కోసం ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులకు, స్థానిక రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పీఏసీఎస్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది.

ఏపీటీడీసీ ఉద్యోగుల నిరసన

(5వ పేజీ తరువాయి)

మెయింటెనెన్స్‌కు సహకరిస్తే అన్ని యూనిట్లు లాభాల్లో ఉంటాయని సూచించారు. ఏళ్ల తరబడి అహోరాత్రాలు కష్టిస్తూ పర్యాటక యూనిట్లను కాపాడుతుంటే, ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా యూనిట్లను నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు పీటీ ప్రసాద్, శివారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటీకరణ దిశగా ముందుకు వెళ్తే.. సమ్మె దిశగా ఆలోచన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చేనేతకు చేయూత

(5వ పేజీ తరువాయి)

బకాయిలు కూడా రద్దు చేస్తామన్నారు. యువతకు చేనేతపై శిక్షణ ఇచ్చేందుకు చిన్నాపురంలో ఒక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, జనసేన బందరు మండల అధ్యక్షుడు గల్లా తిమోతి, బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్లపల్లి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పినిశెట్టి నిరంజనరావు, చేనేత కార్మిక సంఘ నాయకులు విప్పంశెట్టి బసవయ్య, టి.నరసింహారావు, విస్సంశెట్టి బాబు, గొర్రెకృష్ణ, ఏడీ తదితరులు పాల్గొన్నారు.


చిన్నాపురంలో రాట్నం ఒడుకుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ప్రధానికి ఎంపీ ధన్యవాదాలు



వన్‌టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, సహచర టీడీపీ ఎంపీలతో కలిసి సోమవారం పార్లమెంట్‌లో ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టులను త్వరితగతిన మంజూరు చేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నందుకు, విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు నీతి ఆయోగ్ ద్వారా ఆమోదం చేయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

జాతీయ క్రీడాపాలన బిల్లు-2025కు మద్దతు తెలుపుతూ, బిల్లు 'భారతదేశాన్ని నిజమైన క్రీడా శక్తిగా తీర్చిదిద్దే మైలురాయి'గా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభివర్ణించారు. లోక్‌సభలో సోమవారం ఎంపీ ప్రసంగిస్తూ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడల అభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. అమరావతిలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ సిటీ, యూనివర్సిటీ, అలాగే 2024-29 ఏపీ స్పోర్ట్స్ పాలసీని ప్రవేశపెట్టారని, ఈ పాలసీ క్రీడాకారులకు 3 శాతం ఉద్యోగ రిజర్వేషన్, దేశంలోనే అత్యధిక నజరానాలను పతక విజేతలకు అందజేస్తుందని చెప్పారు. గ్రామీణస్థాయి క్రీడల అభివృద్ధిపై మాట్లాడుతూ, విజన్ కలిగిన నేతగా రాష్ట్ర విద్య ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ని కొనియాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు మైదానం, వార్షిక క్రీడాపోటీలు నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దీనికనుగుణంగా 147 ప్రభుత్వ పాఠశాలల మైదానాలను సిద్ధం చేయించటమే కాక, తొమ్మిది రకాల క్రీడాకిట్లను పంపిణీ చేసినట్టు వివరించారు. 'ఖేలో ఇండియా' పథకం కింద ప్రాజెక్టుల సంఖ్యను టియర్-2, టియర్-3 నగరాలకు, ముఖ్యంగా విజయవాడకు పెంచాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డీజీఎం బాధ్యతల స్వీకరణ



రైల్వేస్టేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దక్షిణమధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా సోమవారం చేత్నానంద్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. 1993 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ విభాగంలో రైల్వేలో చేరారు. తూర్పు రైల్వేలోని హసన్‌సోల్ డీఆర్ఎంగా పనిచేశారు. రైల్వేలో ముఖ్య పాలనాఅధికారిగా గ్రీన్‌ఫీల్డ్ లోకోమోటివ్ ప్రాజెక్టు ముఖ్య పాలనాధికారిగా, హాజీపూర్‌లోని రోలింగ్ స్టాక్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా, కోల్‌కత్తాలోని మెట్రో రైల్వే జనరల్ మేనేజర్‌కు సెక్రటరీగా, హసన్‌సోల్ డివిజన్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పలు హోదాల్లో పనిచేశారు.

ఈపీఎఫ్ పెన్షన్‌కు గడువు పొడిగించండి

బస్‌స్టేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పదవీవిరమణ చేసిన ఉద్యోగులు, ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న, విశ్రాంత ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పొందేందుకు గడువు పొడిగించి మరో అవకాశం కల్పించాలని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయానికి లేఖరాశారు. ఈమేరకు అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల్లో చాలమంది కంప్యూటర్ పరిజ్ఞానం లేక సకాలంలో ఈపీఎఫ్ నోటీసులు తెలియనందున హయ్యర్ పెన్షన్‌కు డబ్బులు చెల్లించకపోవటంతో అత్యధికులు పెన్షన్ అర్హత కోల్పోతున్నారన్నారు. ఒడిసా రూర్కేలాలోని ఈపీఎఫ్ ట్రస్ట్ అధికారులు అక్కడి ఉద్యోగులకు మరో అవకాశం కల్పిస్తూ నోటీసులు ఇచ్చారని, అదే విధంగా ఏపీఎస్ఆర్టీసీలో రిటైర్ అయిన, ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న, 58 సంవత్సరాలు పూర్తి అయిన ఉద్యోగులకు కూడా మరో అవకాశం కల్పించి హయ్యర్ పెన్షన్ పొందేలా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వంశీ షరతుల సడలింపు 14కు వాయిదా

విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్యవర్ధన్ కేసులో బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులను ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ 14వ తేదీకి వాయిదా పడింది. దీనిపై విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. బెయిల్ షరతులను ఎత్తివేయాలని కోరుతూ ఆయన కొద్దిరోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కినలెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

విజయ గణపతికి ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెరికీడులోని విజయగణపతి, శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక మహోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శ్యామ్ ఆధ్వర్యంలో నూకల నాగరాజు, సుశీల దంపతులు విజయ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవతామూర్తులను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. నక్కా బాబు, నందూరి వేంకటేశ్వర శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్

విజయవాడ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని నున్న, పాతపాడు, అంబాపురం, పి. నైనవరం, జక్కంపూడి, తదితర గ్రామాల్లో 2946 సర్వీస్‌లను తనిఖీ చేశారు. 39 బృందాలుగా ఏర్పడిన సిబ్బంది వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసిన సిబ్బంది అనుమతించిన కేటగిరిలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వినియోగిస్తున్న వారిని, అధిక లోడ్ వినియోగిస్తున్న 215 మంది వినియోగదారులను గుర్తించారు. ఈ తనిఖీల్లో ఈఈలు విజయకుమారి, హరిబాబు, డిఈ రామూర్తి, ఏఈ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

ఉంగుటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఉరేసుకుని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఆత్కూరు పీఎస్ పరిధిలోని పెదఅవుటపల్లిలో జరిగింది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదఅవుటపల్లి లూర్దునగర్‌లో నివాసముంటున్న దొప్పల సురేష్ (39) రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. వ్యాపారం సరిగా లేకపోవడంతో కుటుంబ పోషణకోసం అందిన చోటల్లా అప్పులు చేశాడు. అప్పులవారినుంచి ఒత్తిళ్లు పెరగటంతో సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్య ఇరుగు పొరుగు వారి సాయంతో చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్‌కు తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. కాగా శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు.



హర్ ఘర్ తిరంగా ప్రదర్శనలో స్వయం సహాయక సంఘాల సభ్యులు

హర్ ఘర్ తిరంగా ప్రదర్శన

ఉయ్యూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటిపై ఈనెల 15 వరకు మువ్వన్నెల జెండా కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరులో ఎంపీడీవో శేషగిరిరావు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సోమవారం జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 వరకు ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు తోడ్పడుతుందని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలి

ఉయ్యూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షణ చేపట్టడం బాధ్యతగా గుర్తెరగాలని కేసీపీ చక్కెర కర్మాగారం ఉయ్యూరు యూనిట్ హెడ్ వై. సీతారామదాస్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం కర్మాగార బయోటెక్ విభాగం ఆవరణలో రోటరీక్లబ్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేసీపీ జీఎం వీవీ పున్నారావు, జీ.వెంకటేశ్వర్లు, సయ్యద్ అనీస్, క్లబ్ సెక్రెటరీ అమీర్ మీర్జా, ఇమ్రాన్, తేజ, వెంకటేశ్వరరావు పాల్గొని మొక్కలు నాటారు.

పీ-4పై సమష్టి కృషి అవసరం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పీ-4 సర్వేలో ఎంపిక చేసిన పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడానికి కూటమి నాయకులు, అధికారులు సమిష్టి కృషి అవసరమని బాపులపాడు తహసీల్దార్ బి. మురళీకృష్ణ తెలిపారు. సోమవారం పీ-4 కార్యక్రమంపై మండల కూటమి నేతలతో సమీక్షా సమావేశం తహసీల్దార్ మురళీకృష్ణ తన కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని 22 సచివాలయాల్లో ఇప్పటి వరకు 14 సచివాలయాల్లో గుర్తించిన పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చి దిద్దడానికి మార్గదర్శలు ముందుకు వచ్చారని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాధరావు, కూటమి నేతలు దయాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, చల మలశెట్టి రమేష్ బాబు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాస రావు,వేగిరెడ్డి పాపారావు, పుట్టా సురేష్, మొవ్వా వెంకటేశ్వరరావు, అక్కినేని కృష్ణాజీ, జాన్ బాషా, మండాది రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్‌ను బలోపేతం చేయాలి

ఉంగుటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే మాదిగ ఉద్యోగులందరూ ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుంటూ మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్)ని బలోపేతం చేయడమే లక్ష్యంగా మండల నూతన కమిటీ కృషి చేయాలని కృష్ణాజిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి విక్టర్‌బాబు అన్నారు. సోమవారం తేలప్రోలులో జరిగిన ఉంగుటూరు మండల ఎంఈఎఫ్ సమావేశంలో మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల ఎంఈఎఫ్ అధ్యక్షులుగా పైడిముక్కల విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా గుడ్డేటి విజయ్‌గాంధీ, కోశాధికారిగా చౌటపల్లి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెత్తమయం!

- కానూరులో పడకేసిన పారిశుధ్యం
- చెరువులోకి చేరుతున్న చెత్త, వ్యర్థాలు.. విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

(కానూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మునిసిపాలిటీలో అతిపెద్ద గ్రామమైన కానూరులో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలోని ఏ కాలనీలో చూసినా, ఏ రోడ్డుపై చూసినా, ఏ ప్రాంతంలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తోన్నా యి. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ పనుల్లో సమయపాలన పాటించకపోవడంతో స్థానికులు తమ ఇళ్లల్లో చెత్తను రోడ్లపై వేస్తున్నారు. దీంతో రోడ్లు చెత్తమయంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది కొరత కూడా తాడిగడప మునిసిపాలిటీలో ఉంది. కానూరులోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం సమీపంలో రోడ్డుపైన, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి చెంతన, చిన్న చెరువు వద్ద, ఉమాశంకర్ నగర్, గాంధీబొమ్మ సెంటర్, రంగాబొమ్మ సెంటర్, పెద్ద చెరువు ప్రాంతం, పంటకాలువ రోడ్డు ప్రాంతం,



కానూరులో నిండిపోయిన డంపర్‌బిన్



కానూరులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

పిన్నమనేని టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తోన్నాయి. గాలికి చెత్తకుప్పల నుంచి వ్యర్థాలు తమ ఇళ్లు, దుకాణాల్లో వచ్చి ఇబ్బందిపడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని వల్ల అనారోగ్య పరిస్థితులు ప్రబలే అవకాశం ఉందని వారు అంటున్నారు. వర్షాలకు రోడ్ల వెంట ఉన్న చెత్తకుప్పల్లోకి నీరు చేరి దుర్వాసన కొడుతూ ఈగలు, దోమలకు నిలయంగా మారింది. దీనిపై తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామంలో చెత్త సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



జెండా ఊపి స్వచ్ఛరథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

చెత్త రహిత పంచాయతీలకు శ్రీకారం

ప్రసాదంపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ రథాలతో పొడి చెత్తను తీసుకొని వాటి విలువకు తగ్గ నిత్యవసర వస్తువులను ప్రజలకు అందజేసేలా, పంచాయతీల్లో చెత్త రహిత కార్యక్రమానికి నేడు నాంది పలుకుతున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం రామవరప్పాడులో నున్న, ప్రసాదంపాడు పంచాయతీల స్వచ్ఛ రథాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీల్లో ఈ వాహనాలు నిత్యం చెత్తను సేకరించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికా రులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల న్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి పి. లావణ్య కుమారి, డివిజన్ పంచాయతీ అధికారి రామవన్, సర్పంచ్‌లు వరి శ్రీదేవి, సర్నాల గంగారత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో జాబ్‌మేళా

పెనమలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సహకారంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు, యువనేత బోడె వెంకట్రామ్ ఆధ్వర్యంలో పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు పోరంకి ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాకు వచ్చే యువత వారి వెంట రెజ్యూమ్ డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తెచ్చుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7981368429 నంబరులో సంప్రదించాలని కోరారు.

అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.10.32 లక్షలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో కానుకల హుండీని సోమవారం తెరిచి లెక్కించారు. గడిచిన 76 రోజులకు గాను హుండీలో రూ. 10, 32, 522లు ఆదాయం లభ్యమైనట్టు దేవస్థానం ఈవో తారకేశ్వరరావు తెలిపారు. మొందూరు గ్రూప్ దేవస్థానం ఈవో ఎం.రాంబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ పాలక మండలి చైర్మన్ పావులూరి రామారావు, ఉత్సవ నిర్వహణ కమిటీ నేతలు వేమూరి శ్రీనివాసరావు, గరికపాటి నాగేశ్వరరావు, వడ్డీ వాసవి, ఆర్యవైశ్య మహిళా సేవా సభ్యులు పాల్గొన్నారు.



కూటమి పాలనలో 40 ఏళ్ల కల సాకారం

రెల్లి కులస్తులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెల్లి కులస్తుల కల కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులో రెల్లి కులానికి చెందిన 20 కుటుంబాలకు సోమవారం ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మారుతుంటారు కాని చేసిన అభివృద్ధి శాశ్వతంగా ఉండిపోతుందన్నారు. తాను మాటలు చెప్పే నాయకుడిని కాదని అభివృద్ధి చేసి చూపించే ఎమ్మెల్యేను అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెల్లిలకు పక్కా పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే నెరవేర్చి చూపించానన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ. 76 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసానన్నారు. రానున్న ఏడాది కాలంలో మరో రూ. 100 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, అమలు దిశగా అడుగులు వేస్తున్నామని తెలియజేశారు. గ్రామ సింహాలు మొరుగుతున్నాయని, వాటికి అభివృద్ధే సమాధానం చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారూన్, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, వైస్ఎంపీపీ దూళిపూడి కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, అనుమోలు ప్రభాకర్, పులి శ్రీనివాస రావు, జనసేన నాయకులు ముప్పా రాజ, బీజేపీ నాయకులు దివి రోహిణి తదితరులు పాల్గొన్నారు.



రెల్లిలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆర్డీవో హేలా షారూన్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, పందిపాటి సుధాకర్, ఏనుగ జయప్రకాష్, డీఎస్ఆర్ పాల్గొన్నారు.



ఉయ్యూరు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సుస్మిత

డీ వార్మింగ్ డే ఏర్పాట్ల పరిశీలన

ఉయ్యూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో నేషనల్ డీ వార్మింగ్ ఏర్పాట్లను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత సోమవారం పరిశీలించారు. మంగళవారం నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం మన దేశంలో 14 సంవత్సరాల లోపు పిల్లల్లో 28 శాతం మంది నులిపురుగుల బారిన పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, పీహెచ్‌సీ వైద్యుడ్ గోపీచంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గన్నవరం : పిల్లల్లో రక్తహీనత నివారణకు తప్పనిసరిగా నులిపురుగులు మాత్రలు వేయాలని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆత్కూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని తెంపల్లి వీరపనేనిగూడెం, కొత్తగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏఎన్ఎం జె.మాలతి, ఆశావర్కర్‌లు టి.సునీత, ఎస్.రాజకుమారి, కె.వాణి తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల మందు పంపిణీ గురించి చర్చిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు

రైతులకు చేరువగా ఏఎంసీ సేవలు : గూడవల్లి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంట మార్కెట్‌కు తరలించేందుకు అవసరమైన రహదారుల అభివృద్ధితో పాటు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన లతో మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, డైరెక్టర్ అర్నేపల్లి రామలక్ష్మి తెలిపారు. గన్నవరం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన గూడవల్లి నరసింహారావును కోడూరుపాడుకు చెందిన టీడీపీ నాయకులు, డైరెక్టర్ అర్నేపల్లి రామలక్ష్మి సోమవారం మర్యాద కలిసి సత్కరించారు. పార్టీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వరరావు, పాండురంగారావు, గండి శ్రీనివాసరావు, అర్నేపల్లి సూరిబాబు, కాశి, తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్ గూడవల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జనసేనకు అన్యాయం చేస్తే సహించను

గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి అధిష్టానం చేసుకున్న ఒప్పందం మేరకు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల పంపిణీలో జనసేనకు అన్యాయం జరిగితే సహించేదిలేదని ఆ పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, జనసేనకు కేటాయించిన గన్నవరం ఏఎంసీ చైర్మన్ పదవిని తిరిగి టీడీపీకి కేటాయించడంలో తన ప్రమేయం లేదని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ పదవి ఎంపిక విషయం తన దృష్టికి రాలేదని జనసేన అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహించానన్నారు. ఈ విషయంలో తాను అవినీతికి పాల్పడి జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్‌కు కేటాయించిన చైర్మన్ పదవిని టీడీపీకి చేజార్చానని సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు.



ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

యూరియా కోసం రైతుల ఆందోళన

ఉంగుటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం మండలంలో పలు పీఏసీఎస్‌ల వద్ద రైతులు, కౌలురైతులు పడిగాపులు పడ్డారు. సోమవారం మండలంలోని అన్ని పీఏసీఎస్‌లకు సుమారు 160టన్నుల యూరియా బస్తాలు దిగుమతి అయ్యాయి. వాటికోసం రైతులు ఎగబడటంతో పలు పీఏసీఎస్‌ల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుపల్లి, ఉంగుటూరులో పోలీసుల సహకారంతో యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ఎరువులు కావాలని సొసైటీలకు వెళితే పాస్‌పుస్తకాలు, గుర్తింపుకార్డులు కావాలని అడుగుతున్నారని, కౌలురైతులకు ఏవిధమైన గుర్తింపుకార్డులు ఇవ్వకుండా ఎక్కడనుంచి తీసుకొచ్చి చూపించాలని సొసైటీ కార్యదర్శులను నిలదీశారు. అందరికీ యూరియా ఇవ్వాల్సిందేనని ఆందోళన చేశారు. ఏవో గద్దె రమేష్ జోక్యం చేసుకుని మూడురోజుల్లో యూరియా సమస్య పరిష్కరిస్తామని, ఆధార్‌కార్డు ఆధారంగా యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బొల్లపాడు, ముదునూరులో..

ఉయ్యూరు : బొల్లపాడు, ముదునూరులో సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. బొల్లపాడు, ముదునూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు యూరియా లోడురాగా తీసుకునేందుకు ఒక్కసారిగా రైతులు ఎగబడటంతో బొల్లపాడు సంఘం వద్ద గందరగోళ పరిస్థితి ఏర్పడింది. క్యూలో నిలబడకుండా ఎవరికి వారు తోసుకుని ముందుకు రాగా ఉద్రిక్తత ఏర్పడింది. యూరియా కోసం పొరుగు గ్రామాల వారు కూడా వచ్చారని, స్థానికులకే ఇవ్వాలని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఏవో నిస్సీగ్రేస్ అక్కడకు చేరుకుని పోలీసులను పిలిపించి రైతులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



బొల్లపాడులో రైతులకు సర్దిచెబుతున్న ఏవో నిస్సీగ్రేస్

శ్రీవిద్య మృతికి కారణమైన నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం

- కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ


శ్రీవిద్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

కూచిపూడి, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పల్లికొండ శ్రీవిద్య మృతికి కారణమైన వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు చేపడతామని, ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మొవ్వ మండలం కొండవరంలో శ్రీవిద్య కుటుంబ సభ్యులు నాగరాజు - శివనందీశ్వరమ్మలను ఆమె సోమవారం పరామర్శించారు. శ్రీవిద్య (23) అత్తింటి వారి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవటం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధితురాలి కుటుంబసభ్యులను అడిగి వివరాలు సేకరించారు. కుమార్తె మృతికి కారణమైన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని తల్లిదండ్రులు కోరారు. మహిళా కమిషన్ పూర్తి అండగా ఉంటుందని చైర్‌పర్సన్ శైలజ హామీ ఇచ్చారు. అత్తవారింటిలో ఆడపిల్లలకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, మహిళా కమిషన్ మహిళలకు అండగా ఉంటుందని తెలిపారు. ఆడపిల్లలు ఫిర్యాదు చేయటంలో సంకోచించవద్దన్నారు. ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, తహసీల్దార్ మస్తాన్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ


బాధితుల అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు పోలీసు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిర్వచనంగా నిలుస్తామని ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో 33 మంది తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో ఆయనకు అందజేశారు. మీకోసంలో వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. తమకు జరిగిన అన్యాయానికి న్యాయం కోసం సామాన్య ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తుంటారని, అటువంటి వారి సమస్యను సానుకూలంగా విని పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అధికారులతో కలిసి ప్రజల అర్జీలు స్వీకరించారు. జేసీ ఇలక్కియా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

దసరా డ్యూటీ ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు చెల్లించాలి


దసరా నవరాత్రులు ఉత్సవాలలో పాల్గొనే ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియాకు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం నేత కమల మాట్లాడుతూ, ఆశా వర్కర్లు గౌరవ వేతనం రూ.10 వేలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారని తెలిపారు. అలాంటి వారికి ప్రతిరోజు గుడి వద్దకు డ్యూటీకి రావడం, వెళ్లడం ఆర్థికంగా ఇబ్బందిగా వుంటుందన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.పద్మ, ఎం.దుర్గ పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ డిపార్చర్ బ్లాక్‌లో విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం


విజయ పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని, ఎండీ ఈశ్వరబాబు

బస్‌స్టేషన్, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ డిపార్చర్ బ్లాక్‌లోని డి-6 నెంబరు షాపులో విజయ డెయిరీ పార్లర్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు ప్రారంభించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు మాట్లాడుతూ విజయ డెయిరీ పాలు, పాల పదార్థాలు నాణ్యతతో ప్రజలకు అందుబాటు ధరలతో అందిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ కొనకళ్ల నారాయణరావు విజయ డెయిరీ పదార్థాలను కొనుగోలు చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) జనరల్ మేనేజర్ రమేష్, డీజీఎం (సేల్స్) డి.లక్ష్మణరావు, ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ విజయరత్నం, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి వై. ఏసుదానం, బస్ స్టేషన్ ఏటీఎం శ్యామ్ ప్రసాద్, విజయ పార్లర్ నిర్వాహకుడు మధు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సామాజిక సేవ అభినందనీయం


ఎస్‌బీఐ అందజేసిన అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న కార్మిక మంత్రి శుభాష్

మాచవరం, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యతలో భాగంగా రాష్ట్రంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రులకు రూ. 65 లక్షలు విలువ చేసే అంబులెన్సులను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అందజేసింది. అంబులెన్సులను పచ్చ జెండా ఊపి మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈఎస్‌ఐ ఆసుపత్రులకు అంబులెన్సులు అందజేసిన ఎస్‌బీఐ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ షితాక్షిసింగ్, ఎస్‌బీఐ విజయవాడ వెస్ట్ ప్రాంతీయ మేనేజర్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రాజీ, ఈఎస్‌ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ వి.జ్యోతి పాల్గొన్నారు.

ఏటీఎస్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

- ఏపీ ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

విజయవాడ, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సిస్టం(ఏటీఎస్)ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు లారీ, ట్యాక్సీ, గూడ్స్ వ్యాన్, ఆటో తదితర అసోసియేషన్ ప్రతినిధుల సోమవారం ప్రజావేదికలో వినతిపత్రం సమర్పించారు. డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, ఏటీఎస్ విఫలమైందన్న వాస్తవాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదినారాయణ మాట్లాడుతూ, వాహన ఫిట్‌నెస్ నిర్వహణ బాధ్యతలనుగుత్తేదారులకు అప్పగించాలనుకోడం ప్రమాదకరమన్నారు. రాష్ట్ర కోశాధికారి దొమ్మేటి సోమ శంకరరావు, వెన్నా సత్యనారాయణ, విన్నకోట మోహన్‌జీ, వగడాల పాండు రంగారావు, ఏ.వి.వి సత్యనారాయణ, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న డీఆర్వో కె.చంద్రశేఖరరావు



డీఆర్వో నేతృత్వంలో జాతీయ పతాకాలతో ఉద్యోగుల ర్యాలీ

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- అధికారులకు డీఆర్వో చంద్రశేఖర్ ఆదేశం

మచిలీపట్నం, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దిన వేడుకలకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం అధికారులతో కలిసి ప్రజల నుంచి 103 అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో స్వాతంత్ర్య దిన వేడుకలకు పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌ను ముస్తాబు చేసే పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లా ప్రగతిని వివరిస్తూ మంత్రి చేసే ప్రసంగంలో అన్ని విభాగాల సమాచారాన్ని తెలియజేసేలా సమాచారశాఖకు పంపాలన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) పోర్టల్‌లో ఆయా విభాగాల డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంలో అధికారులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. గతంలో రెండోస్థానంలో ఉన్న జిల్లా ఏడో స్థానానికి పడిపోయిందన్నారు. అధికారులు స్పందించి ఈ పనిని వేగవంతం చేయాలన్నారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ నియామకపత్రాలు పొందిన వారికి పోస్టింగ్ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత శాఖల అధికారులకు షోకాజ్‌నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. గంజాయి వంటి మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి ఐదు సంవత్సరాలు అయిన నేపథ్యంలో ఈనెల 13వ తేదీన మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆర్డీవో కేస్వాతి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీదేవి, పోతురాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మచిలీపట్నం టౌన్ : కేంద్రప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, స్వదేశీ ఉత్పత్తుల కొనుగోలు చేస్తూ ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని డీఆర్వో కె చంద్రశేఖరరావు పిలుపు నిచ్చారు. హర్‌ఘర్ కా తిరంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆర్ అండ్ బి గెస్టుహౌస్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వరకు అధికారులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని డీఆర్వో చంద్రశేఖరరావు ప్రారంభించి ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించాలన్నారు. అన్ని పరిశ్రమలు, పార్కులు, కర్మాగారాలు, వ్యాపార సంస్థలపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు.

డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, జిల్లా పర్యాటక అధికారి రామలక్ష్మణ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిదూర్జటి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ శివప్రసాద్, పశుసంవర్థక శాఖ అధికారి నరసింహులు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, బీసీ కార్పొరేషన్ రాజేంద్రబాబు, దివ్యాంగుల శాఖ ఏడీ కామరాజు, రవికాంత్ పాల్గొన్నారు.


చల్లపల్లిలో కేడీసీసీ బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం, ఎమ్మెల్యే మండలి

రైతులకు వడ్డీలేని రుణాలు ఇచ్చే దిశగా ఆలోచన

- డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్

చల్లపల్లి, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. చల్లపల్లిలో రూ.కోటి 58 లక్షలతో నిర్మించిన బ్యాంకు భవనాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో నెట్టెం రఘురాం ప్రారంభించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, రైతులకు సరిపడా యూరియా అందిస్తామన్నారు. మరో ముఖ్య అతిథి, కేడీసీసీ జిల్లా బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, రైతులకు వడ్డీలేని రుణాలిచ్చే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అభ్యుదయ రైతులున్నారని, బ్యాంకు పురోభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, సహకార వ్యవస్థ పరిపుష్టికి ఎన్నికలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా నియమితులైన చైర్‌పర్సన్లు రైతుసేవే పరమావధిగా పనిచేయాలన్నారు. ఆప్కాబ్ జీఎం పి.మణి, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్ మనోహర్, డీజీఎం ప్రభాకరరావు, టీడీపీ రాష్ట్ర నేత కొనకళ్ల బుల్లయ్య, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, రొండి కృష్ణయాదవ్, చల్లపల్లి బ్యాంకు చీఫ్ మేనేజర్ యలవర్తి నగరాజకుమారి, మేనేజర్లు పి.ప్రశాంతి, ఎస్.శిరీష, సయ్యద్ సల్మా, సుధీర్, సొసైటీ చైర్‌పర్సన్లు బొందలపాటి వీరబాబు, గుత్తికొండ వంశీకృష్ణ, మల్లుపెద్ది దుర్గామహేష్, పెద్దిబోయిన హరనాథ్, తిరుమలశెట్టి బాల నాగేశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వరరావు,సొసైటీ సీఈవోలు, రైతులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. కోటి 54 లక్షల 77 వేల రైతునేస్తం, డ్వాక్రా రుణాల మంజూరు పత్రాలు అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

సత్యనారాయణపురం కర్మల భవనం నామినేషన్ పద్ధతిన కేటాయింపు రద్దు

- వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

టెండరు కమ్ బహిరంగ వేలం నిర్వహించకుండా నామినేషన్ విధానంలో కర్మల భవనం కేటాయిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో కౌన్సిల్ ఆమోదించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం జీవోను జారీ చేసింది.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో సత్యనారాయణపురంలోని కర్మల భవనాన్ని గాయత్రి సొసైటీకి నామమాత్రపు లీజు ప్రాతిపదికన కట్టబెట్టారు.

వైసీపీ ప్రభుత్వ హయాం లో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ వల్లూరి ఎన్‌డీఎస్ సత్యనారాయణ మూర్తి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. గాయత్రి సొసైటీ సెంట్రల్ మాజీ శాసనసభ్యుడు మల్లాది విష్ణుకు సంబంధించినది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారం ఉండటంతో నామమాత్రపు లీజుకు గాయత్రి సొసైటీకి కట్టబెట్టాలన్న ఉద్దేశ్యంతో ఏప్రిల్ 27, 2023లో కౌన్సిల్ సమావేశంలో 33వ తీర్మానంగా ఆమోదించారు. స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ మూర్తి ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. అప్పట్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం టెండరు కమ్ బహిరంగ వేలం నిర్వహించకుండా కార్పొరేషన్ ఆస్తిని నామినేషన్ విధానం లో కట్టబెట్టడం చట్టవిరుద్ధంగా భావించిన ప్రస్తుత మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ప్రతిపాదనను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం నాటి కౌన్సిల్ కేటాయింపును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఉపాధ్యాయుడి కీచకపర్వంపై విచారణ


ఉపాధ్యాయులను విచారిస్తున్న డీవైఈవో సాంబశివరావు

చందర్లపాడు, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చందర్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడి కీచక పర్వంపై ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం డీవైఈవో సాంబశివరావు, ఎంఈవో శ్యాంబాబు విచారణ చేపట్టారు. అధికారుల బృందం బాధిత విద్యార్థినులను విడివిడిగా విచారించారు. సోషల్ ఆడిట్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు అందించిన వారినే కాకుండా మిగిలిన విద్యార్థినుల నుంచి కూడా సమాచారం సేకరించారు. వారిచ్చిన వాఙ్మూలాన్ని రికార్డు చేశారు. హెచ్‌ఎం రోహిణిని పిలిపించి విచారించిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఎందుకున్నారని మందలించినట్లు సమాచారం. ఆమె నుంచి లిఖిత పూర్వక సమాధానం సేకరించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మద్దినేని నాగేశ్వరరావుతో సహా సిబ్బందిని విచారించారు. ఉన్నతాధికారుల విచారణలో సైతం విద్యార్థినులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. డీవైఈవో సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ జరిపినట్లు తెలిపారు. గతంలో ఫిర్యాదు చేసిన విద్యార్థుల నుంచి మరో మారు లిఖిత పూర్వక సమాచారం తీసుకున్నామన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి ప్రవర్తనపై తోటి ఉపాధ్యాయుల సమాచారం సేకరించామన్నారు. సదరు ఉపాధ్యాయుడి వివరణ కూడా తీసుకున్నామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.


పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి విజ్ఞప్తి

గవర్నర్‌పేట, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కోరారు. పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు, ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ, డిగ్రీ కళాశాల అడిషనల్ డైరెక్టర్ సిహెచ్ రాజులను సోమవారం కలిసిన గోపిమూర్తి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలు పాతపద్ధతిలో నిర్వహించి మార్కుల అ సైన్డ్ వరకు పరిమితం చేయాలని కోరారు. పుస్తకంలో పరీక్షలు రాయడం, ఓఎంఆర్ షీట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కష్టమని, ఓఎంఆర్ షీట్ అప్‌లోడ్ చేయడం విరమించుకోవాలని వినతిపత్రంలో వివరించారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం అనేక పథకాలు పెడుతోందని, అవి నిర్వహించడానికి ప్రతి ఉన్నత పాఠశాలకు నాన్ టీచింగ్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, ప్రాథమిక పాఠశాలల ఆన్‌లైన్ కోసం క్లస్టర్ వారీగా కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. విద్యార్థుల హాజరు సమయం ఉదయం 10 గంటల వరకు అవకాశం ఇవ్వాలని, డిఎస్సీ కంటే ముందు అంతర్ జిల్లా బదిలీలు, పండిట్ పీఈటీ పోస్టులు, పదోన్నతులు చేపట్టాలని కోరారు.


వజ్రాల వేటలో స్థానికులు

కొండంత ఆశ.. వజ్రాల కోసం వేట

కంచికచర్లరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యానికి పూర్వం కంచికచర్ల మండలం పరిటాల నిజాం నవాబు పాలనలో ఉండడం, గతంలో అడపాదడపా వజ్రాలు దొరికిన దాఖలాలు ఉండడంతో పరిటాల చెరువు ప్రాంతంలో ప్రజలు ఆదివారం వజ్రాల కోసం వెదుకులాట ప్రారంభించారు. విలువైన వజ్రాలు, రంగురాళ్లు ఈ ప్రాంతలో దొరికిన ఆధారాలు కూడా ఉండడంతో ప్రజలు ఆశతో వాటి కోసం వెదుకులాట చేపట్టారు. వర్షాలు పడుతుండటంతో వజ్రాలు దొరుకుతాయనే ఆశతో సూదురా ప్రాంతాల నుంచి ప్రజలు ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చి వజ్రాలు, రంగు రాళ్ల అన్వేషణలో నిమగ్నమయ్యారు. కొందరైతే కుటుంబ సభ్యులందరూ భోజనాలు, తాగునీరు సైతం తెచ్చుకుని వజ్రాల వేటలో పడ్డారు. తమకు కనపడిన రంగు రాళ్లను కడిగి వజ్రమా? కాదా అని పరిశీలన చేస్తున్నారు. కొందరు వజ్రాల వ్యాపారులు, ఏజెంట్లు కూడా ఇక్కడకు వస్తుండడంతో తమకు దొరికిన వాటిని వారికి చూపించి విక్రయిస్తున్నట్లు వినికిడి. తాజాగా ఆదివారం పరిటాలకు చెందిన ఒక వ్యక్తికి విలువైన వజ్రం దొరికిందని, బహిరంగా మార్కెట్లో దాని విలువ రూ.4కోట్లు వరకు ఉంటుందని, అయితే రూ.2.4 కోట్లకే అమ్మాడని సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వజ్రం దొరికిందన్న విషయమై గ్రామస్థులు కాని, పోలీసులు ఆధికారులు కానీ ధ్రువీకరించకపోవడం గమనార్హం.


సీఆర్డీఏ భవన పనుల పురోగతిని తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

మంత్రి నారాయణ సీఆర్డీఏ ప్రాజెక్టు పరిశీలన

విజయవాడ, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాయపూడిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సీఆర్డీఏ భవనం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఆధునిక హంగులతో రూపొందుతున్న కార్యాలయాన్ని సోమవారం మంత్రి నారాయణ పరిశీలించారు. సుమారు 2 లక్షల 42 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం చేపట్టారు. ప్రతి అంతస్తులో అధికారుల కేబిన్, ఉద్యోగుల వర్క్‌స్టేషన్లను మంత్రి పరిశీలించారు. సీఆర్డీఏ, ఏడీసీతో పాటు మున్సిపల్ శాఖకు చెందిన విభాగాలను ఈ భవనంలోకి ప్రభుత్వం తరలిస్తుందన్నారు. వీలైనంత త్వరగా సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీస్ ప్రారంభోత్సవం చేసే ఆలోచనలో ప్రభుత్వముందన్నారు.

రొయ్యు రైతులకు హామీలేని రుణాలు

- నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె.సూద్


ఒప్పందపత్రాలతో నాబార్డ్ డీఎండీ డాక్టర్ ఎ.కె.సూద్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రేణు నాయర్

విజయవాడ, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా ఎక్స్ఛేంజ్ అందించిన సాంకేతికత రైతులకు పంట నష్టాలను నివారించడం లోను, రొయ్యల ఉత్పాదకత సాధించడంలో సహాయపడుతుందని నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె.సూద్ అన్నారు. వీరవల్లి ప్రాంగణంలో సోమవారం జరిగిన రైతు సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, నాబార్డ్ ఆక్వా ఎక్స్ఛేంజ్‌తో కుదుర్చుకున్న భాగస్వామ్యంలో భాగంగా రైతులకు పూచీకత్తు లేని రుణాలను ప్రారంభించినట్లు తెలిపారు. వీరవల్లికి చెందిన సాంకేతిక సంస్థ ఆక్వాఎక్స్ఛేంజ్ ఐదు వేల మందికిపైగా రొయ్యల రైతులకు సాంకేతిక అవసరాల్లో సేవలందిస్తోందన్నారు. యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ రేణు నాయర్, ఏ.వి.భవానీ శంకర్, నాబార్డ్ సీజీఎం మణికుమార్, రాష్ట్ర వ్యవసాయ, సహకార ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రిలో అత్యాధునిక డాక్‌బాక్స్ పరికరం

- రోగి వైద్యం వివరాలన్నీ ఒకేచోట నిక్షిప్తం : డాక్టర్ రమేష్‌బాబు


అత్యవసర విభాగంలో అమర్చిన డాక్‌బాక్స్ వద్ద డాక్టర్ యార్లగడ్డ రమేష్, కేర్‌ఫ్లుయెన్స్ సహవ్యవస్థాపకుడు లాయిడ్ విలియమ్స్


విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆయుష్ ఆసుపత్రిలో అత్యాధునిక డాక్‌బాక్స్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ఆయుష్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఆసుపత్రిలోని ఐసీయు కాంప్లెక్‌లో సోమవారం ఈ పరికరాన్ని కేర్‌ఫ్లుయెన్స్ సంస్థ సహవ్యవస్థాపకుడు, ఆపరేటింగ్ ఆఫీసర్ లాయిడ్ విలియమ్స్ ప్రారంభించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, సాధారణంగా ఆసుపత్రికి రోగులు ఏదో ఒక సమస్యతో మాత్రమే వస్తారన్నారు. అలా కాకుండా శరీరంలో ఎక్కువ అవయవాలు పనిచేయని రోగులకు క్రిటికల్ కేర్ వార్డులు ఉంటాయని, ఇలాంటి రోగులకు చాలా రకాల పరికరాలు అమర్చుతారని చెప్పారు. ఈ పరికరాలు కేవలం ప్రాథమిక సమాచారాన్ని విడివిడిగా కొన్ని రోజుల వరకే నిక్షిప్తం చేస్తాయని తెలిపారు. డాక్‌బాక్స్‌ను ఐసీయూలో బయోమెడికల్ పరికరాలతో డిజిటల్ రికార్డులతో నేరుగా అనుసంధానం చేయడం వల్ల రోగి వైద్యానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఐదేళ్లపాటు భద్రపరుస్తుందన్నారు. దీనివల్ల వైద్యులు రోగి వైద్యానికి సంబంధించిన వివరాలు డెస్క్‌టాప్ మీద క్షణంలో చూసుకోవచ్చన్నారు. చికిత్స అందించే ముందు ఇందులో లాగిన్ అవ్వాలని, దీని వల్ల చికిత్స విధానంలో కూడా ఎలాంటి తప్పిదాలు రాకుండానిలువరిస్తుందని ఆయన తెలిపారు. ఈ పరికరం సహాయంతో రోగి అత్యవసర సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోయినా సిబ్బంది సహాయంతో ప్రాణాలు కాపాడవచ్చని డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రస్తుతం డాక్‌బాక్స్ కేవలం ఆయుష్ ఆసుపత్రిలోనే మాత్రమే ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ, డాక్టర్ పి.ఎస్.ఎస్.చౌదరి, అడ్మినిస్ట్రేటివ్ మేడ జయలక్ష్మి, క్రిటికల్ కేర్ నిపుణులు, బయోమెడికల్ నిపుణులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమావేశాలకు ఎంపీలను పంపాలి

- సీఎంకు రాష్ట్ర నేతల లేఖ

వన్‌టౌన్, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం సమావేశానికి కూటమి ప్రభుత్వ ఎంపీలను, మంత్రులను పంపించి బీసీ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైనాగేశ్వరరావు యాదవ్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి వెలగాల నూకాలమ్మ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం లేఖ రాశారు. సుమారు 500 మంది ఏపీలోని ముఖ్య బీసీ నేతలతో నిర్వహించే రెండు రోజుల సమావేశానికి టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, ఎంపీలను పంపించి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపటంతో పాటు బీసీ మహిళలకు సబ్ కోటా కూడా చేర్చాలని, జనగణన కులాల వారీగా జరగాలని డిమాండ్లతో రెండు రోజుల సమావేశం జరుగుతున్నట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మారెళ్లకు బంగారు పతకం

గుడివాడ, అగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేరళలో జరిగిన నేషనల్ మాస్టర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు 410 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్టేడియం కమిటీ, జిమ్ శిక్షకులు ఆయనను స్టేడియం జిమ్‌లో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంకదాసరి ప్రసాదరావు , స్టేడియం కమిటీ నాయకులు వల్లభనేని లక్ష్మీ కృష్ణ వరప్రసాద్, గూడెపు బాబు, జిమ్ కోచ్‌లు ఉష, ఎన్. నరేంద్ర జిమ్ శిక్షకులు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



మారెళ్ళ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న స్టేడియం నేతలు

జాగ్రత్తగా వెళ్లాల్సిందే..!

(ఆంధ్రజ్యోతి - గుడివాడ రూరల్): దొండపాడు - మోటూరు మధ్యలో ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి పంట బోదులోకి కోతకు గురికావటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారిపై నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. దీంతో వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించాలంటే గోతులను చూసుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్ అండ్‌బీ రహదారి కోతకు గురై ఆరునెలలు దాటుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాల్లేవని పలు విమర్శలు వినవస్తున్నాయి. ముఖ్యంగా గుంటాకోడూరు, గోల్వేపల్లి, సైదేపూడి, మోటూరు గ్రామాల ప్రజలు ప్రతీ నిత్యం గుడివాడ రావటానికి రైల్వే ట్రాక్ లేకపోవటంతో ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిపై ఇరువైపులా ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి ఇరువైపులా రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే వాహనదారులు నానా తంటాలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సదరు అధికారులు స్పందించి , రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> **నిధులు మంజూరయ్యాయి**
>
> రహదారి మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరయ్యాయి. వీలైనంత త్వరలోనే రహదారి మరమ్మతు పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
>
> **రామస్వామి, ఆర్‌అండ్‌బీ ఏడీ**



ధ్వంసమైన దొండపాడు - మోటూరు ఆర్‌అండ్‌బీ రహదారి

వెంట్రప్రగడ , వానపాముల సొసైటీల అధ్యక్షుల నియామకం

పెద పారుపూడి , ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండలంలోని 5 పీఏసీఎస్ సొసైటీలు ఉండగా, 3 సొసైటీలు అధ్యక్షులుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచనలతో నియమించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిగా పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షులను నియమించే ప్రక్రియలో భాగంగా యలమర్రు సొసైటీ అధ్యక్షుడిగా నగుళ్ల శ్రీనివాసరావు, వానపాముల సొసైటీ అధ్యక్షుడిగా వేముపల్లి నరసింహారావు, వెంట్రప్రగడ సొసైటీ అధ్యక్షుడిగా కూచిపూడి సుబ్బయ్యలను నియమించినట్లు వారు తెలిపారు. మిగిలిన రెండు పెదపారుపూడి, పాములపాడు సొసైటీలను త్వరలో నియమించనున్నట్టు తెలిపారు.



సుబ్బయ్య



నరసింహారావు



అర్జీదారుకు వివతి పత్రం ఇస్తున్న ప్రజలు

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

● అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్

గుడివాడ, అగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వర పరిష్కారానికి మీకోసం ఎంతగానో ఉపయోగపడుతుందని కృష్ణాజిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం మీకోసంలో వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించనున్నామన్నారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ పాల్గొని ప్రజల నుంచి గ్రీవెన్స్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికలో మొత్తం 5 సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. టిడ్కో కాలనీకి సంబంధించి 4 సమస్యలు రాగా ఆక్రమణ గురించి మరో సమస్య వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ బి.నిర్మలా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : గుడివాడ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో రెండు అర్జీలు వచ్చాయి. తమ పొలం సమస్యను పరిష్కరించాలని రెండు అర్జీలు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ రామశేషు, ఏవో అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, అగస్టు 11(ఆంధ్రజ్యోతి): గుడివాడ అభివృద్ధికి అధికారులు అన్ని విధాలుగా పనిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజల నుంచి సమస్యల అర్జీలను తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గుడివాడ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ, రూరల్ మండలాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, వాసే మురళి, నాయకులు పంద్రాజు సాంబశివరావు, పెద్దు వీరభద్రరావు, పొలంకి సారథి, సాయన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్లకు సమస్యలు తెలుపుతున్న ప్రజలు

పేద వర్గాలకు భరోసా సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరు కావటం పేదవర్గాలకు ఎంతగానో భరోసా కల్పిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. వేములమడ, కోసూరు గ్రామాల్లోని పలువురికి సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబాలవారికి అందజేశారు. వేములమడకు చెందిన మురారి అప్పాజీరావు కుటుంబానికి రూ.1,09,507లు, కోసూరుకు చెందిన అరిగె దేవీ హేమంత్‌కు రూ.1,06,365లు, పెద్దిబోయిన కోటేశ్వరరావుకు రూ.70,758, బోరుకాటి వజ్రంకు రూ.35,348ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, దేవినేని రమేష్, వీరంకి తులసీదాస్, పలువురు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సహకార సంఘాల్లో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని, అక్రమంగా ఎరువులను బయటకు అమ్మితే వారిపై తగు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి అన్నారు. సోమవారం మోటూరు, సెరిదింటకుర్రు తదితర గ్రామాల్లో ఉన్న సహకార సంఘాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ వీఏఏలను దగ్గరుంచి రెవెన్యూ సిబ్బందితో కలసి యూరియాను రైతులకు పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేశారు. ఆమె మాట్లాడుతూ స్థానికంగా ఉన్న రైతులు, పొలం ఉన్న రైతులకు ప్రాముఖ్యతనిస్తామని, అది కూడా తక్కువ మోతాదులో రైతులకు అందేవిధంగా చూస్తామన్నారు. రైతులు అధికారులకు సహ కరించాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులందరికీ యూరియా, డీఏపీ అందించటానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



పీఏసీఎస్‌ను పరిశీలించిన ఏవో అనంతలక్ష్మి

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెదపారుపూడి, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పామర్రు నియోజకవర్గ యూనిట్ తరపున పెదపారుపూడి మండలంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తుండటంతో పెదపారుపూడి మండల ఉద్యోగులు కూడా మేము సైతం అంటూ పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. డీఏ, ఐఆర్‌లతోపాటు ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ విధానం వంటి అన్ని అంశాలపై ఉద్యోగులందరూ ఐక్యమత్యంగా ఉండాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేష్; సీనియర్ అసిస్టెంట్ బేగం, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.



'రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం'లో ఉద్యోగులు

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

గుడివాడ, అగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానిక నీలామహల్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలుకొండ భద్రయ్య (50) సరస్వతి వీధిలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆదివారం గంగానమ్మ సంబరంలో పాల్గొన్న వ్యక్తి సోమవారానికి విగత జీవిగా పడిఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వరిగడ్డి లారీ దగ్ధం

పమిడిముక్కల : తాడంకిలో సమీపంలో సోమవారం రాత్రి జాతీయ రహదారి పక్కన నిలిపిఉంచిన వరిగడ్డి లారీ దగ్ధమైంది. గ్రామానికి చెందిన వరిగడ్డి వ్యాపారి చలపాటి శ్రీనివాసరావు లారీలో గడ్డిలోడుతో రోడ్డుపక్కన నిలిపిఉంచగా ఒక్కసారిగా గడ్డినుంచి మంటలు వచ్చి లారీ అంతటిని చుట్టుముట్టాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. పామర్రు అగ్నిమాప సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. జాతీయరహదారి పక్కన లారీలోని గడ్డి తగులబడుతూ మంటలు లేవగా కొద్దిసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పమిడిముక్కల పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్రమ బద్ధీకరించారు. ఘటనలో రూ. 2లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొట్లూరి రవికుమార్

టీడీపీ బలోపేతానికి కృషి

● మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్

గుడ్లవల్లేరు, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ కలసి పనిచేస్తేనే పార్టీ అన్న సిద్ధాంతంతో ఎమ్మెల్యే రాము ముందుకు వెళుతున్నారన్నారు. కమిటీలు వేయడానికి ఈనెల 13 వరకూ సమయం ఉందని వాస్తవాలు తెలియకుండా మిడిమిడి జ్ఞానంతో సమావేశంలో ఏదొఒకటి మాట్లాడేశారని అన్నారు. సొసైటీ త్రిమెన్ కమిటీలను బాపయ్య చౌదరి, నాయకులతో చర్చించిన తరువాతే ఎంపిక చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొడాలి రామరాజు, డీసీ చైర్మన్ పాలేటి అంజనేయులు, వెనిగళ్ల నాగేశ్వరరావు, ఈడే మోహన్, పామర్తి సత్తిబాబు, పులి ప్రసాద్, వీరమాచనేని శివప్రసాద్, అబ్దుల్ సత్తార్, లక్ష్మీ నరసింహరాజు, అంకాలు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తిని ఎలుగెత్తి చాటాలి

● ఎంపీడీవో కె.జ్యోతి

పామర్రు, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహనీయుల స్ఫూర్తిని ఎలుగెత్తి చాటించాల్సిన అవశ్యకత మన అందరిపై ఉందని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. ప్రభుత్వం సూచనలమేరకు జరుగుతున్న హర్‌ఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పామర్రు పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయల పరిధిలోని ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం ఒకటో గ్రామ సచివాలయవద్దనుంచి భారత జాతీయ పతాక విశిష్టతను తెలియజేసే విధంగా స్థానిక పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో తెలుగువారు నిర్వహించిన అనిర్వచనీయమైన వివరిస్తూ ఈర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో గుత్తికొండ కిషోర్, గ్రామసచివాలయ కార్యదర్శులు నెరుసులక్ష్మి, వీర నరేష్, సీహెచ్ ఉమమహేశ్వరి, ఎడ్యుకేషన్ వేల్ఫేర్ కార్యదర్శులు కఠంమనేని పల్లవి, ఎమ్మెస్‌కేలు రాజేశ్వరీ, విజయలక్ష్మి, స్వాతి, వెంకట కిషోర్ వీఆర్వోలు కుమార్,లీలాకృష్ణ పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీడీవో కె.జ్యోతి

విద్యుత్‌కు అంతరాయం నేడు

పమిడిముక్కల, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా కపిలేశ్వరపురం, హనుమంతపురం,ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాలలో మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.గోవిందరావు ఒకప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం

పెదపారుపూడి : దోసపాడుకు చెందిన ప్రముఖ రైతు, పీఏసీఎస్ సొసైటీ సభ్యుడు తుమ్మల రామారావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పీఏసీఎస్ సీఈవో పి.కుమారి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఏసీఎస్ సంఘం తరపున రూ.10వేల చెక్కును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు.

అంగడాల సేవలు అభినందనీయం

గుడివాడ : బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్ పార్టీ అభివృద్ధితో పాటు అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, మాజీ అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబులు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో అంగడాల సతీష్ 55వ జన్మదినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు.

తెలుగు భాషపై అవగాహన తప్పనిసరి

గుడ్లవల్లేరు : తెలుగు బాష సమగ్రంగా నేర్చుకోవడం వల్ల ఇతర బాషలు చాలా సులువుగా నేర్చుకోగలమని ప్రముఖ కవయిత్రి డాక్టర్ వి.సత్యవతి అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో తెలుగు భాషపై అవగాహన కల్పించారు.

బంగారు కుటుంబాల దత్తత అభినందనీయం

● ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమ్రాన్

గుడ్లవల్లేరు, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు మండలం బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం వారిని మార్గదర్శులు దత్తత తీసుకోవడంలో విజయవంతంగా కృషి చేసిన పంచాయతీ కార్యదర్శులు, మార్గదర్శులు రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నిలిచారని గుడ్లవల్లేరు ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 17 గ్రామాల్లో 2520 బంగారు కుటుంబాలకు 192 మంది మార్గదర్శులు దత్తత తీసుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న పథకాలు వారికి చేరనున్నాయని ఇమ్రాన్ అన్నారు. ఈ ప్రక్రియకు సహకరించిన కార్యదర్శులు, సంబంధిత సిబ్బందిని ఆయన అభినందించారు.



పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న నగేష్

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పాల ఉత్పత్తిదారులు ఆర్థిక అభివృద్ధికి కృష్ణా మిల్క్‌యూనియన్ కృషి చేస్తోందని జిల్లా పాలుత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ అర్జా నగేష్ అన్నారు. సోమవారం గుడ్లవల్లేరులోని పాలశీతలీకరణ కేంద్రంలో కేంద్ర పరిధిలోని 98 సంఘాలకు పదిశాతం ధరవ్యత్యాసం మొదటి విడత బోనస్ రూ. 59.48 లక్షలు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల శ్రేయసును దృష్టిలో ఉంచుకొని అనేక పథకాలను, వైద్య సదుపాయాలను యూనియన్ నిర్వహిస్తుందని ఆయన అన్నారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్, పాడి రైతులకు ఏసీటీ ఇన్సూరెన్స్ క్షీర బంధు, కల్యాణమస్తు వంటి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాలశీతలీకరణ కేంద్ర మేనేజరు చిట్టూరి దామోదరకృష్ణ గోపీనాథ్, యూనియన్ ట్రస్ట్ సభ్యులు కాగిత జయరాం, పీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్న , సన్నకారు రైతులకు యూరియా పంపిణీ

● పీఏసీఎస్ కార్యదర్శి నాగరాజు



పెదపారుపూడిలో యూరియా తీసుకెళ్తున్న రైతులు

పెదపారుపూడి, అగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడిలోని పీఏసీఎస్ పరిధిలోని ఐదు గ్రామాలైన భూషణగుళ్ల, మహేశ్వరపురం, గురువిందగుంట, ఈదులమద్దాలి, పెదపారుపూడి గ్రామాల్లోని సన్న, చిన్న కారు రైతులకు వచ్చి రెండు యూరియా కట్టలు సోమవారం పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై నుంచి 335 యూరియా కట్టలు మాత్రమే వచ్చాయని, వాటిని ప్రస్తుతం సన్న, చిన్నకారు రైతులకు ఆధార్‌కార్డు మీద రెండేసి కట్టలు ఇచ్చామన్నారు. ఒక్కొక్క కట్ట 45 కేజీలు బరువుతో రూ.266లు ఖరీదు చొప్పున పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియా దిగుమతి చేసి రైతులకు అందించాలని గ్రామీణ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని అధికారులను కోరుతున్నారు.

గుడ్లవల్లేరు : యూరియా కొరత ఏర్పడిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో పీఏసీఎస్ ద్వారా 250 బ్యాగ్‌ల యూరియాను రైతులకు సరఫరా చేశారు. ఎవరికీ అధికంగా కేటాయించకుండా రైతు సాగును బట్టి వారి పాస్‌పుస్తకాలను పరిశీలించి వారికి కావలసిన మోతాదును మాత్రమే సరఫరా చేసేలా టీడీపీ నాయకులు చూశారు. గుడ్లవల్లేరు పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ఇటీవలే త్రిమెన్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన యెనిగళ్ల నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబులు దగ్గరుండి రైతులకు యూరియాను సరఫరాను చేయించారు.



గుడ్లవల్లేరులో యూరియా సరఫరా చేయిస్తున్న టీడీపీ నాయకులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

విద్యార్థులు రక్తదాతలు కావాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రక్తదానం చేసి రోగులను ఆదుకోవాలని జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ పి.బి. సాల్మన్ రాజు అన్నారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. సాల్మన్‌రాజు మాట్లాడుతూ, కోవిడ్ అనంతరం హెచ్‌ఐవీ కేసులు పెరుగుతున్నాయన్నారు. దీనిపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక జబ్బులపై అవగాహన కల్పిస్తూ కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకిశెట్టి హరనాథ్‌బాబు, జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డా. వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

• అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

పెడన, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని పెడనలో నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన అన్నదాతలు 175 ట్రాక్టర్లతో పెడనలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ట్రాక్టర్ ర్యాలీని స్థానిక తోటమూలలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రారంభించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

అక్కడ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పెడన బైపాస్ రోడ్డు, గుడివాడ బైపాస్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, బంటుమిల్లి రోడ్డుల మీదుగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు కొనసాగింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన సభలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమాన్ని కాంక్షించి కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సభలో టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, అర్జా వెంకటనగేష్, వడుగు తులసీరావు, యక్కల శ్యామలయ్య, శీరం ప్రసాద్, కూనపరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ గాలి గోపురం సంప్రోక్షణ కార్యక్రమం సోమవారం వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ ఆవరణలో రూ. 15 లక్షలతో నిర్మిస్తున్న స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, కర్రా మోహనరావు, బొడ్డు దీక్షానందుడు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం

నాగాయలంక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు పీఏసీఎస్‌లకుగాను మూడు సంఘాలకు చైర్‌పర్సన్లను ప్రభుత్వం నియమిం చింది. నాగాయలంకకు చైర్‌పర్సన్‌గా ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, సభ్యులుగా తాడేపల్లి వెంకట పాపారావు, బండ్రెడ్డి బాలకృష్ణ, ఎదురుమొండి పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా కొక్కిలిగడ్డ నాగరాజు, సభ్యులుగా పోలాబత్తిన నాంచారయ్య, కొక్కిలిగడ్డ కోటేశ్వరరావు, వక్కదివర పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా బోగాది నరసింహారావు, సభ్యులుగా బోగాది రమాదేవి, డి.గోపేశ్వరమ్మలను నియమిం చినట్లు అధికారులు తెలిపారు.

గూడూరు: మండల పరిధిలోని నాలుగు పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్, సభ్యులను ప్రభుత్వం నియమించింది. రామన్నపే ట చైర్‌పర్సన్‌గా మురాల ధనుష్, సభ్యులుగా మాతంగి సుబ్బారావు, పరసా ప్రశాంతి, ముక్కోలు పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా సమ్మెట రాఘవ ప్రసాద్, సభ్యులుగా శాఖల మహంకాళిరావు, ముక్కు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కంకటావ పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా సుంకర రవీంద్రనాథ్‌ఠాగూర్, సభ్యులుగా వాకా చిన అమలే శ్వరరావు, దోనే అరుణబాబు, రామానుజ వర్తర్లపల్లి పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా పి. సీతామహాలక్ష్మి, జంపన గౌతు మునేశ్వరరావు, మురాల ఈశ్వరరావులను ప్రభుత్వం నియమించింది.

పాఠశాల స్థలం కబ్జాపై విచారణ చేయండి

మచిలీపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లో పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించి దొంగపత్రా లు పుట్టించారని, ఈ అంశంపై విచారణ చేసి ప్రభుత్వం పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కాపాడాలని కోరుతూ చిలకలపూడికి చెందిన టీడీపీ నాయకులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ అందజేశారు. పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమించడమేకాక, ఆ స్థలం నలుగురైదుగురు కొనుగోలు చేసినట్లుగా నకిలీపత్రాలు పుట్టించారని అర్జీలో వివరించారు. అర్జీ ఇచ్చినవారిలో 5వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, ఆర్ రత్నారావు, పలువురు కాలనీ వాసులు ఉన్నారు.

యూరియా కొరత.. రైతుల అగచాట్లు

» బుద్దాలపాలెం సహకార సంఘం వద్ద రైతుల క్యూ

మచిలీపట్నంటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం బందరు మండలంలోని రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. ప్రైవేట్ డీలర్లు కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో బందరు మండలం బుద్దాలపాలెం సహకార సంఘం వద్ద సోమవారం యూరియా విక్రయించారు. ఇది తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. రైతులందరికీ యూరియా అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు.

పెడన రూరల్ : మండలంలోని నందిగం, చేవేంద్ర, నందమూరు, కొంకేపూడి, దావోజిపాలెం, పెనుమల్లి, కవిపురంలో ఉన్న సహకార సంఘాలకు 117.81 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. సోమవారం రైతులు ఆయా సంఘాల వద్దకు పెద్ద సంఖ్యలో రావటంతో గందరగోళం నెలకొంది. పోలీసులు కల్పించుకొని సక్రమంగా పంపిణీ చేయించారు.



బుద్దాలపాలెం సహకార సంఘం వద్ద క్యూ కట్టిన రైతులు

మోపిదేవి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా కోసం రైతులు నానా ఆగచాట్లు పడాల్సి వస్తుంది. సోమవారం ఉదయం యూరియా పంపిణీ చేపట్టడంతో రైతులు వందల సంఖ్యలో పీఏసీఎస్ గోడౌన్ల వద్ద బారులు తీరారు.

పెదకళ్లేపల్లి పీఏసీఎస్ గోడౌన్ వద్ద రైతులు తోపులాటకు దిగటంతో మండల వ్యవసాయ శాఖాధికారిణి కె.హెప్సిబా రాణి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కావలా ఉండాల్సి వచ్చింది.

చిరస్మరణీయులు మిక్కిలినేని పాపారావు

• సంతాపసభలో ప్రముఖుల నివాళి

చల్లపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం చక్కెర కర్మాగారం కార్మిక సంఘం నేతగా కార్మికుల ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేసి, సమాజాభివృద్ధికి పరితపించిన ఆదర్శనీయులు మిక్కిలినేని పాపారావు చిరస్మరణీయులని పలువురు వక్తలు కొనియాడారు. కార్మిక, రైతు నాయకులు పాపారావు సంస్మరణ సభ చల్లపల్లిలోని శారదా గ్రాండియర్ ఫంక్షన్ హాలు లో సోమవారం జరిగింది. మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, రైతు నాయకులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వేమూరి రమేష్‌బాబు, వీరమాచినేని భవానీప్రసాద్, పరుచూరి అంజయ్య, దోనేపూడి గోపీకృష్ణ, వేమూరి రత్నగిరి, కార్మికసంఘం నేతలు పత్రి వెంకట రమణారావు, ఎ.బాలసుబ్రహ్మణ్యం, మండవ అజయ్ కుమార్, కేసీపీ ప్రతినిధి ఎస్.సంపత్‌కుమార్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, కమ్యూనిస్టు పార్టీల నేతలు శీలం నారాయణరావు, యద్దనపూడి మధు, గుత్తికొండ రాము, ప్రముఖులు మత్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.ఆర్‌కె.ప్రసాద్, సజ్జా చలపతిరావు, యార్లగడ్డ అరవింద్, దుబ్బుల సాంబ శివరావు, యార్లగడ్డ శివప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాస రావు, నాదెళ్ల పూర్ణచంద్రరావు, కొడాలి మురళి, మాలెం పాటి రంగారావు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సంస్మరణ సభ కార్యక్రమాన్ని కేసీపీ ఉద్యోగి తుమ్మల శ్రీను పర్యవేక్షించారు.



మిక్కిలినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రముఖులు

తొలుత పాపారావు చిత్రపటం వద్ద ప్రముఖులు నివాళులర్పించి పాపారావు కుమారుడు, టీడీపీ నేత మిక్కిలినేని మధును పరామర్శించారు.

వాసవీమాత ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

అవనిగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వాసవీమాత ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరిశీలించారు. గుర్రపు చెరువు వద్ద రూ.1.30 కోట్లతో నిర్మాణం చేపట్టిన వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి నూతన ఆలయ శ్లాబు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), అద్దెపల్లి నాంచారయ్య, చెన్నగిరి అయ్యప్ప, నంబూరి సుబ్రహ్మణ్యం, నంబూరి వెంకటేశ్వరరావు, విస్సంశెట్టి శేషు, మానేపల్లి వేణు, కోడూ రు సత్యనారాయణ, అద్దెపల్లి ప్రసాద్, విస్సంశెట్టి మురళీ, దేసు మణికంఠ, ఘంటసాల నరేంద్ర, చెన్నగిరి భూపేష్ పాల్గొన్నారు.



శ్లాబు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

దేశభక్తిని పెంపొందించుకోవాలి : గొర్రెపాటి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘర్‌ఘర్ తిరంగా ర్యాలీతో పాటు స్వచ్ఛతాహి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తి పెంపొందించుకుంటూ నగరంలో పరిశుభ్రతను పాటించాలన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ, చారిత్రక కోనేరుసెంటర్‌లో జెండా వీరుడు తోట నరసయ్య లాఠీల దెబ్బలను లెక్కచేయకుండా కోనేరుసెంటర్ స్తం భంపై జెండా ఎగురవేశారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేటర్లు చిత్త జల్లు నాగరాము, అన్నం ఆనంద్, అసిస్టెంట్ కమిషనర్ ఎం గోపాలరావు పాల్గొన్నారు.



పరిశుభ్రత ర్యాలీలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్

సుబ్బారాయుడికి వెండి ఆభరణాల బహూకరణ

మోపిదేవి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ఉయ్యూరుకు చెందిన మురుగుల సరస్వతీదేవి, వారి కుటుంబ సభ్యులు రూ.63 వేల విలువ గల వెండి వస్తువులను బహూకరణగా అందజేశారు. సోమవారం వారు కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విచ్చేశారు. స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి పూల సజ్జ, వెండి పళ్లెంలను ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు అందజేశారు.



వెండి వస్తువులను స్వామికి అందజేస్తున్న దాతలు

అనధికార మద్యం స్వాధీనం

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో బలరామునిపేటలో సోమవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్ముతున్న మేకల మారుతిని అదుపు లోకి తీసుకుని అతని వద్ద నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడిలో సీఐ లక్ష్మణరావు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, వేణు, వినయ్‌లు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే నాయకులకు పదవులు : మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్ , ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన నాయకులకు పదవులు ఇస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులుగా నియమితులైన గుమ్మడి విద్యాసాగర్‌ను సోమవారం మల కాపట్నంలో మంత్రి రవీంద్ర ఘనంగా సత్కరించి ప్రసంగించారు. విద్యావేత్తగా, ఎస్సీ సంఘ నాయకునిగా గుమ్మడి విద్యాసాగర్ అం దిస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు అక్కు మహంతి రాజా తదితరులు పాల్గొన్నారు.

బందరుకోటలో వేగవంతంగా డ్రెయినేజీ నిర్మాణం

బందరుకోటలో వేగంగా డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఎంతో కాలంగా వేధిస్తున్న డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అనంతరం కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వాటర్‌ప్లాంట్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడి విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు 50 మంది రెడ్‌క్రాస్ వలంటీర్లు

అవనిగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరుగనున్న పరేడ్‌కు అవనిగడ్డ డిగ్రీ కళాశాల నుంచి 50 మంది యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లను పంపుతున్నట్లు అవనిగడ్డ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.ఉమారాణి తెలిపారు. పేరెడ్‌లో పాల్గొనే వలంటీర్లకు, మిగిలిన యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు మొత్తం 100 మందికి రెడ్‌క్రాస్ యూని ట్ నుంచి టోపీలు, టీషర్టులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి బవిరి శంకర్‌నాథ్, కృష్ణాజిల్లా రెడ్‌క్రాస్ యూనిట్ సమన్వయకర్త ఎస్.హరికృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యులు కొండవీటి ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ కళాశాల కో-ఆర్డినేటర్ డా.ఎ.వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ వలంటీర్లతో ప్రిన్సిపాల్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం : దేవినేని ఉమా

కోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం కోడూరు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పటానికి ఉదాహరణ కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి సూచిక అని తెలిపారు. గతంలో కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని, మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీ పీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్, మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా చెక్కుల అందజేత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ప్రీమియంతో తపాలా బీమా పాలసీ తీసుకున్న వారికి ఎక్కువ బోనస్ అందజేస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటీవల బీమా పాలసీ చేసి మృతి చెందిన ఇద్దరు పాలసీ హోల్డర్ కుటుంబ సభ్యులకు సోమవారం పోస్టల్ సూపరింటెండెంట్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగరాజు, పోస్టు మాస్టర్ జి అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ నాయకుల డిమాండ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా మచిలీపట్నం నడిబొడ్డున నిర్మించిన వైసీపీ కార్యాలయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన మీడియాతో టీడీపీ నాయకులు మాట్లాడారు. పోలీసు వారి స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా పార్టీ కార్యాలయ నిర్మాణానికి వినియోగించడం సబబు కాదన్నారు.

టీడీపీ నేత దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, 2022లో అనుమతి తీసుకున్నారని 2023 నాటికి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో శివగంగ పీఏసీ ఎస్ చైర్‌పర్సన్ పీవ్వళ్ల కాంతా రావు, పివి ఫణికుమార్, ఆళ్ల మాధవ తదితరులు పాల్గొన్నారు.

మేకావారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం బందరు రూరల్ మండలం మేకావారిపాలెంలో ఇంటింటికీ టీడీపీ నాయకులు తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా తలారి సోమశేఖర్ మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నూరుశాతం పూర్తి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.పి. రామస్వామి, కాగిత శేషు, బత్తిన నాగరాజు, కూనపరెడ్డి బాలవీరవెంకటేష్, ఈడే వెంకటేశ్వరరావు, దాసి సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దివంగత నేత మండలికి కూటమి నేతల నివాళి

నాగాయలంక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం 8వ రోజు మండల కూటమి నేతలు నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, తలశిల వెంకట నరసింహారావు, కర్రి కృష్ణమూర్తి, బండ్రెడ్డి జోసు, రేమాల బాబురావు, మంచాల తిరుపతి వరప్రసాద్, గుడివాక శివరావు, తానంకి చంటి, తదితరులు పాల్గొన్నారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జికిషోర్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కిషోర్ తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే తమ పాఠశాలల్లో 14వ తేదీలోగా పోటీలు నిర్వహిస్తారన్నారు.

నేడు యానాదులకు ఫైబర్ బోట్లు పంపిణీ

నాగాయలంక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాబార్డు వారి సహకారంతో ప్రజాప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో నాగాయలంక మండలంలోని మర్రిపాలెం, కమ్మనమోలు, సంగమేశ్వరం గ్రామాలలోని 25 ఎస్టీ యానాదుల కుటుంబాలకు ఐదు ఫైబర్ బోట్లు పంపిణీ చేయనున్నారు.